క్లుప్తంగా

టీఎన్‌జీవోస్ సభ్యత్వ నమోదు



లింగంపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా టీఎన్ జీవోస్ సంఘం పిలుపు మేరకు ఎల్లారెడ్డి యునిట్ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు అధ్యక్షుడు మహిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగులకు ప్రాథమిక సభ్యత్వం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శరణ్, ఉద్యోగులు రాజాగౌడ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



మాచారెడ్డి: తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం మాచారెడ్డిలో నిరుద్యోగ కళాకారులు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో కళాకారులు తెలంగాణ కళాకారుల సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సొంటెం సాయిలు, సభ్యులు అన్నబోయిన శ్రీనివాస్, సొంటెం రాజలింగం యాదవ్ తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉండి పార్టీని బలోపేతం చేయడానికి కృషిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి, షౌకత్‌అలీ, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

రేపు తాడ్వాయిలో రైతుల ధర్నా



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో వచ్చే సోమవారం రైతుల సమస్యలపై ధర్నా ఉంటుందని రైతులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల పంటల రుణమాఫీ, పెండింగ్‌లో ఉన్న పాలబిల్లులు, పెండింగ్ ఉన్న రైతుబంధు తదితర సమస్యలపై చర్చించనున్నామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో గంగాధర్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు కాలనీలను పరిశీలించి పారిశుధ్య పనులను ఆయన తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త సవిత, ఆశావర్కర్ మనీష తదిత రులు ఉన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి తనిఖీ



పిట్లం(జుక్కల్):మండల కేంద్రంలోని రిజిస్ట్రేషన్ ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులను ల్యాబ్‌ను శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ రెన్యువల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిట్లం మెడికల్ ఆఫీసర్ రోహిత్ కుమార్, సీహెచ్‌వో దయానంద్ పాల్గొన్నారు.

తాగునీటికి అష్టకష్టాలు..



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా జీపీలో తాగునీటికి ప్రజలు తంటాలు పడుతున్నారు. బోరు బావులు, రక్షిత నీటి ట్యాంకు ఉన్నా కుళాయిల ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి పోవడంతో గిర్నితండా, జరుప్లా తండా ప్రజలు నీటి కోసం తిప్పలు పడుతున్నారు. జీపీ నుంచి ట్యాంకర్ వస్తుండగా అక్కడ నీటికోసం రోజు యుద్ధమే జరుగుతోందంటున్నారు.



బిచ్కుందలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలీలు



బీబీపేటలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి



మద్నూర్‌లో..

తెలంగాణ పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..



కామారెడ్డి పట్టణంలో పద్మశాలి, బీసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో..



పిట్లంలో పద్మశాలి, చేనేత సంఘం ఆధ్వర్యంలో..



ఎల్లారెడ్డిలో..

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధపెట్టాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : విద్యార్థుల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైనదని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరై మాట్లాడారు. హెచ్‌ఎం గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బీరయ్య, పాల్గొన్నారు. అలాగే మోడల్ స్కూల్‌లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.

కామారెడ్డి రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని హెచ్‌ఎం గంగాకిషన్ సూచించారు. శనివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. టీచర్లు శ్రీశైలం, సాయిలు, శ్రీనివాస్, రమేష్ ఉన్నారు.

బాన్సువాడ రూరల్ : పిల్లలను చిన్నచిన్న కారణాలతో ఇంటి వద్ద ఉంచుకోరాదని, క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గోపి అన్నారు. టీచర్లు సంతోష్, చైతన్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

నిజాంసాగర్(జుక్కల్) : తమ పిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంచందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించాలి



బాన్సువాడ : ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలని తహసీల్దార్ వరప్రసాద్ సూచించారు. శనివారం బాన్సువాడ తహసీల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఓటరు జాబితాను అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించామన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాయిలు, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



బిచ్కుంద(జుక్కల్) : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందు ఉండి లక్ష్యంతో ముందుకు వెళ్లాలని జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. శనివారం బిచ్కుంద జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, పాండు రంగారావు, లెక్చరర్లు శివకుమార్, శంకర్ తదితరులున్నారు.

సత్తాచాటిన ఉప్పల్‌వాయి క్రీడాకారులు

రామారెడ్డి : ఈనెల 19, 20న హైదరాబాద్‌లోని ఓయూలో జరిగిన 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉప్పల్‌వాయిలో గురుకులం క్రీడాకారులు ప్రతిభ చాటారు. పలు విభాగాల్లో స్వర్ణ, కాంస్య పతకాలను సాధించారు. కె. ప్రవీణ్ ట్రై అథ్లెటిక్స్ స్వర్ణం, కె.ఉదయ్ కిరణ్ హైజంప్, లాంగ్ జంప్ విభాగంలో స్వర్ణం, బి భానుప్రసాద్ 200 మీటర్ల పరుగు పందెం విభాగంలో కాంస్యం సాధించారు. పి గౌతమ్ షాట్‌పుట్ విభాగంలో కాంస్యం, ఎ గణేశ్ కంబైన్డ్ విభాగంలో కాంస్యం, దిల్సాన్ ట్రై అథ్లెటిక్స్‌లో కాంస్యం సాధించినట్లు ప్రిన్స్‌పాల్ శివరామ్ తెలిపారు. ఎంపికైన వారిలో కె ప్రవీణ్, కే ఉదయ్ కిరణ్ వచ్చేనెలలో గుంటూరులో జాతీయ అథ్లెటిక్స్‌లో పాల్గొంటారన్నారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ శివరాం, వైస్ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి తదితరులున్నారు.



హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు

పంటపొలాల పరిశీలన

బాన్సువాడ రూరల్ : మండలంలోని బుడిమి గ్రామంలో పంటపొలాలను శనివారం కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సందర్శించారు. ఇటీవల ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన పంటల నమోదు వివరాలను సరిచూశారు. వరికి ఎండాకు తెగులు నుంచి రక్షించుకోవడానికి పలు సూచనలు చేశారు. ఏఈవో రాణి ఉన్నారు.

బాన్సువాడ రూరల్ : వరిలో ప్రస్తుతం బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఎక్కువగా కన్పిస్తోందని దీని నివారణకు వెంటనే రైతులు నత్రజని ఎరువుల వాడకం నిలిపివేయాలని ఏఈవో చిట్టంపల్లి కావ్యశ్రీ అన్నారు. శనివారం ఆమె సోమేశ్వర్ శివారులో రైతులతో కలిసి ఎండాకు తెగులు సోకిన పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎండాకు తెగులును పూర్తిగా నివారించడం కష్టమని కాపర్ హైడ్రాక్సైడ్ 2.0 గ్రాములు, స్ట్రెప్టో మైసిన్ సల్ఫేట్‌ను 0.4 గ్రాములు ఒకలీటరు నీటిలో కలిపి దుబ్బు వచ్చే దశలో పిచికారి చేయాలన్నారు. ఆఖరి దశగా పోటాష్ ఎరువును ఎకరాకు 15 నుంచి 20కేజీలు వర్షాలు తగ్గిన తర్వాత వేయాలన్నారు. బాన్సువాడలోని కోనాపూర్‌లో మండల వ్యవసాయాధికారి నదీమ్ ఉద్దీన్, ఏఈవో జ్ఞానేశ్వర్ సూచనలిచ్చారు.



బుడిమిలో వరిని పరిశీలిస్తున్న తిరుమల ప్రసాద్

వాతావరణ పరిస్థితుల వల్లే తెగుళ్లు

నిజాంసాగర్(జుక్కల్): వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో వరి పంట పొలాలు తెగుళ్ల బారిన పడుతున్నాయని ముగ్దుంపూర్ క్లస్టర్ ఏఈవో రేణుక అన్నారు. శనివారం మహమ్మద్ నగర్ మండలం గాలీ పూర్, ముగ్దుంపూర్ గ్రామ శివారుల్లో వరి పంటను ఆశించిన తెగుళ్లను పరిశీలించారు. తెగుళ్ల నివారణ కు ప్రాపికొనజల్, కార్బప్ హైడ్రోక్లోరైడ్ పిచికారి చేయాలని సూచించారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి



రామారెడ్డి : మండలంలోని గొల్లపల్లికి పది రోజులుగా ఆర్టీసీ బస్సు రాక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ శనివారం డీఎంను గ్రామస్తులు కలిసి వినతి ఇచ్చారు. డీఎం సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో పాల మల్లేశ్, జీర్ల ఎల్లయ్య తదితరులున్నారు.

లో వోల్టేజీ నివారణకు చర్యలు

భిక్కనూరు : లో వోల్టేజీ నివారణకు వేగవంతంగా చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ కిరణ్ చైతన్య చెప్పారు. శనివారం మండలంలోని కాచాపూర్‌లో అదనపు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకు అవసరమైన భూమిని గ్రామస్తులు కొనుగోలు చేసి ట్రాన్స్‌కో అధికారులకు రిజిస్ట్రేషన్ చేసి అందజేశారు. ఏడీఈ మాట్లాడుతూ అదనపు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకు అవసరమైన స్థలం లేక ఇబ్బంది పడ్డామని ప్రస్తుతం పనులు వేగంగా చేస్తామన్నారు.



పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



ఎల్లారెడ్డి : పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శనివారం శాలువాతో సన్మానించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన ఎమ్మెల్యే పీసీసీ అధ్యక్షుడితో పాటు రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని కూడా సన్మానించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మర్కల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్‌లో మహిళ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన వీధుల్లో పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణి, కార్యదర్శి ప్రవంతి, అధ్యాపకురాలు ఉదయిని పాల్గొన్నారు.

బీబీపేట : ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ అన్నారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకుల వద్ద పరిశుభ్రం చేశారు. కార్యదర్శి రమేష్, కారోబార్ సిద్దరాములు తదితరులు ఉన్నారు.

కామారెడ్డి రూరల్ : పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో హెప్సీబారాణి అన్నారు. శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇస్రోజివాడిలో ఎంపీడీవో, క్యాసంపల్లి గ్రామంలో ఎంపీవోలు పర్యటించారు. వాటర్ ట్యాంక్‌లను క్లినింగ్ చేయించి క్లోరినేషన్ చేయించారు. జీపీ రికార్డులను పరిశీలించారు. ఐకేపీ ఏపీఎం మొయిజ్, గ్రామ కార్యదర్శులు సామ్యరెడ్డి, కల్పన తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు



తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. ఆయన శనివారం తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామాల్లో చెత్తాచెదారం నిలువ ఉండవద్దన్నారు. చెత్తచెదారాన్ని ట్రాక్టర్లలో నింపి డంపింగ్ యార్డులకు తరలింపజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్, ఎంపీవో సవితా రెడ్డి, ఏపీవో మల్లేశ్ తదితరులున్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : పరిసరాల పరిశుభ్రతపై కనీస అవగాహన కల్గి ఉండాలని జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్ రావు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని డంపింగ్ యార్డ్, ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్‌లను పరిశీలించారు. కంపోస్ట్ షెడ్‌ను సందర్శించారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి తదితరులున్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని ఎంపీవో మలహరి ప్రతిజ్ఞ ప్రతిజ్ఞ చేయించారు. శనివారం ఆయన ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మురికి కాల్వల్లో పూడిక తీయించారు. రోడ్ల పక్కన, వీధుల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. జీపీ కార్యదర్శులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని మల్లయ్యపల్లి గ్రామాన్ని ఆమె పరిశీలించారు. వైరల్ ఫీవర్లు వ్యాపిస్తున్న దృష్ట్యా ప్రతిఒక్కరూ వారి ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి తదితరులున్నారు.

స్వచ్ఛ బాన్సువాడ కోసం కృషి చేయాలి

బాన్సువాడ : మున్సిపాలిటీని స్వచ్ఛ బాన్సువాడగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చే యాలని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ సూచించారు. శనివారం బాన్సువాడలో వి ద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అ నంతరం స్వచ్ఛతా రన్ నిర్వహించారు. మినీస్టేడియం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు స్వ చ్ఛతా రన్ నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజు, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, ఖలేక్ తదితరులున్నారు.



బాన్సువాడలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



కామారెడ్డి రూరల్ /కామారెడ్డి అర్బన్ : కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని(వర్డ్) ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ కామారెడ్డి రూరల్ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ ఎం వంశీకృష్ణ, సీసీడీ శ్రీ విద్య సూచించారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని ఎస్సీ వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో చదువుతున్న కిశోర, బాల బాలికలకు అనగా 8,9,10 తరగతుల బాలబాలికలకు విడివిడిగా శిక్షణనిచ్చారు. ఎస్సీ వాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అరుణ జ్యోతి, లింగాపూర్ పాఠశాల హెచ్‌ఎం టి కమల తదితరులున్నారు.

మద్నూర్‌లో భారీ వర్షం

మద్నూర్/నాగిరెడ్డిపేట : మద్నూర్, నాగిరెడ్డిపేట మండలాల్లో శనివారం 2 గంటల పాటు భారీ వర్షం కురియడంతో వాతావరణం చల్లబడింది. పక్షం రోజులుగా ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఉక్కపోతతో పరేషాన్ అయ్యారు. శనివారం ఉదయం వాతావరణం చల్లబడి ఆకాశం మబ్బులతో కమ్ముకుని ఉరుములతో భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. సాయంత్రం మరోమారు ఒక మోస్తారు వర్షం కురిసింది. ప్రస్తుతం ఉన్న కంది, పత్తి పంటలకు వర్షం మేలు చేసిందని రైతులు పేర్కొంటున్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రాజిరెడ్డి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మోడల్ స్కూల్,కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంత వరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న రాజేందర్ నందిపేట్‌కు బదిలీ అయ్యారు. కొత్తబాది మోడల్ స్కూల్‌లో పని చేసిన రాజిరెడ్డి బదిలీపై సదాశివనగర్‌కు వచ్చారు.

ఆధ్యాత్మికం

ఆలయంలో భక్తుల సందడి



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో శనివారం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయంలో సందడిగా మారింది. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహరాజ్‌లు ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరా స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరున్ని రకరకాల పూలతో అందంగా అలంకరించారు. భక్తి శ్రద్ధలతో భగవన్నామ సంకీర్తనలతో భజనలు చేశారు.



భక్తి శ్రద్ధలతో గణనాథులకు పూజలు

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో వినాయకుల శోభాయాత్ర ఘనంగా ప్రారంభమైంది. అందంగా అలంకరించిన ట్రాక్టర్‌లు, ప్రత్యేక వాహనాల్లో వినాయకులను ఉంచి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. నాసిక్ డోళ్లు, డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్ సిస్టమ్‌ల మధ్య యువకులు నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ప్రతి యేటా 15 రోజుల పాటు పూజలు చేసి 16వ రోజు నిమజ్జనం చేయడం గ్రామ అనావాయితీ, శనివారం ప్రారంభమైన శోభాయాత్ర, సోమవారం రాత్రి వరకు జరగనుంది.

సంక్షిప్తం

సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి : పోగొట్టుకున్న ఓ సెల్ ఫోన్‌ను శనివారం బా ధితుడికి మాచారెడ్డి ఎస్సై అనిల్ అప్పగించారు. మండలంలోని ఘన్‌పూర్‌నకు చెందిన తోకల తిరుపతి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ ద్వార ట్రేస్‌చేసి ఫోన్‌ను అప్పగించారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులకు సన్మానం

కామారెడ్డి టౌన్ : టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీలో చోటు దక్కిన జర్నలిస్ట్ నాయకులను శనివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జర్నలిస్టులు సన్మానించారు. రాష్ట్ర గ్రామీణ విలేకరుల సంక్షేమ కమిటీ సభ్యుడిగా రజనీకాంత్, రాష్ట్ర దాడుల నియంత్రణ కమిటీ సభ్యుడిగా ఇంద్రసేనారెడ్డి నియమితులైన సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టులు శ్రీనివాస్, అన్వర్, అబిద్ తదితరులున్నారు.

సెట్విన్‌లో యువతకు శిక్షణ

కామారెడ్డి అర్బన్ : సెట్విన్ స్వయం ఉపాధి శిక్షణకు యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ కామారెడ్డి శిక్షణ సంస్థ సమన్వయకర్త సయ్యద్ మొయిజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వయంఉపాధి శిక్షణలో 50శాతం ఫీజు రాయితీ ఉంటుందని, ఉచిత స్టడీ మోటిరీయల్ ఉంటుందని 73861 80456, 79891 59121లో సంప్రదించవచ్చన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని వాసవి పాఠశాలలో ఆదివారం మెగా వైద్య శిబిరం ఏర్పాట్లు చేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వారు అన్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీశారు

కామారెడ్డి అర్బన్ : తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి ఆలయ పవిత్రతకు భంగం కలిగించారని, బాధ్యులపై సమగ్ర విచారణ చేయాలని వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లి రాజు, విభాగ్ విశేష సంపర్క్ గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక భజరంగి కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, రాజు అశోక్, వినోద్ పాల్గొన్నారు.

నియామకం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా అమృతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అంబేద్కర్ సంఘం నాయకులు శనివారం తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంజీవులు, ఉపాధ్యక్షులుగా రవి, కార్యదర్శిగా సాయిలు, సహాయ కార్యదర్శులుగా ప్రకాష్, వెంకట్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అమర్లబండ ప్రాథమిక పాఠశాలలో శనివారం హెడ్‌కానిస్టేబుల్ సాయిలు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను సెల్‌ఫోన్, టీవీలకు దూరం ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాయి గౌతం, కారోబార్ సంజీవ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.